పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్

సీఎం రేవంత్‌రెడ్డి నివాళి

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా' అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని సీఎం మంగళవారం ఆయన సేవలను స్మరించుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువులవైపు దృష్టిసారించకుండా ప్రతి ఒక్కరికీ కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పర్చారని పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ జనసభతోపాటు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తుచేశారు. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని, ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందని తెలిపారు.

స్పీకర్‌కు గడువు పెడ్తం

మొదటిపేజీ తరువాయి...

ఏ చర్యలూ తీసుకోకుండా స్పీకర్ కాలయాపన చేస్తున్నారని తప్పుపట్టారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన తర్వాత కూడా స్పీకర్ తీరులో మార్పు లేదని తప్పుపట్టారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విధులను నీరుగార్చడమేనని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు (హైకోర్టు/సుప్రీంకోర్టు) ఆదేశాలు జారీ చేయవచ్చునని వాదించారు. తన వాదనను బలపరిచే పలు తీర్పులను ఆయన ఉదహరించారు. స్పీకర్ మూడు నెలల గడువులోగా పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌పై విచారణ పూర్తి చేయాలని మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం తీర్పు చెప్పిందని తెలిపారు. ఆ తీర్పును హైకోర్టు అమలు చేయాలని కోరారు.

నాలుగు వారాల్లో తేల్చమనండి

మూడు నెలల గడువు ఎప్పుడో ముగిసిందని, మరో నాలుగు వారాల గడువు ఇచ్చి తుది నిర్ణయం తీసుకునేలా స్పీకర్ కార్యాలయానికి ఉత్తర్వులు ఇవ్వాలని గండ్ర మోహన్‌రావు కోరారు. స్పీకర్, పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై చర్యలు తీసుకోకుండా ఉంటే ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోతుందని అన్నారు. అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌ను స్పీకర్ విచారణ చేయకుండా కాలయాపన చేసిన పరిస్థితుల్లో ఆ వ్యవహారంపై హైకోర్టు/సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేయవచ్చునని చెప్పారు. మార్చిలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పటికి మూడు నెలల గరిష్ఠ గడువు ముగిసినందున మరో నాలుగు వారాలు స్పీకర్ సమయం తీసుకునేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అసెంబ్లీ రూల్స్ 6, 7 ప్రకారం స్పీకర్ వ్యవహరించడం లేదని మోహన్‌రావు వాదించారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్నాకే కోర్టులు న్యాయ సమీక్ష చేయవచ్చని ఏజీ చెప్పారు. స్పీకర్ వద్ద పిటిషన్‌కు నంబర్ కేటాయించమని కూడా ఉత్తర్వులు జారీ చేసే పరిధి కోర్టులకు లేదని అన్నారు. ఈ కేసులో వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

వరంగల్ టు మేడారం గ్రీన్ కారిడార్

స్టేట్ లెవల్ కమిటీ ఆమోదం

మంత్రి కొండా సురేఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): హరితనిధి నిధులతో వరంగల్ నుంచి మేడారం వరకు మల్టీ లేయర్ అవెన్యూ, మీడియన్ ప్లాంటేషన్లను రూ.6.63 కోట్లతో, వరంగల్, హనుమకొండ డీఎఫ్‌వోల పరిధిలో అవెన్యూ, మీడియన్ ప్లాంటేషన్లను రూ.5.6 కోట్లతో చేపట్టేందుకు స్టేట్ లెవల్ కమిటీ ఆమోదం తెలిపింది. మంగళవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అధ్యక్షతన సచివాలయంలోని అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో హరితనిధి పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

కవిత డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ సీబీఐ కేసులో రౌస్ ఎవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగనుండగా.. కవిత తరఫు న్యాయవాదులు మంగళవారమే పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయిస్తామని న్యాయవాదులు తెలిపారు.

ఒప్పందం 'స్వచ్ఛ'మేనా?

మొదటిపేజీ తరువాయి...

బయోమాస్, సెల్యులోజ్ నుంచి జీవ ఇంధనాలు, జీవ రసాయనాలను ఉత్పత్తి చేసే పేటెంట్ పొందటంతోపాటు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసింది.

లేని కంపెనీతో ఒప్పందమా?

'స్వచ్ఛ్ బయో' కంపెనీతో ఒప్పందంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. స్వచ్ఛ్ బయో అనే కంపెనీకి సంబంధించిన వెబ్‌సైట్ గానీ, సోషల్ మీడియా ఖాతాగానీ లేకపోవడంతో పులువురు అనుమానాలు వ్యక్తం చేశారు. స్వచ్ఛ్ బయో పేరుతో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో ఎటువంటి సంస్థ నమోదు కాలేదని, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖలో కూడా దీని వివరాలు లభ్యం కాలేదని అంటున్నారు. కంపెనీస్ చెక్ వెబ్‌సైట్‌లో వెతికినా దాని జాడ కానరాలేదని వాపోతున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో స్వచ్ఛ్ బయో చైర్మన్‌గా ప్రవీణ్ పరిపాటి అని పేర్కొనగా.. అసలు ఆయన పేరుతో ఆ కంపెనీ లేకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్వచ్ఛ్ బయోకు దాదాపు దగ్గరగా 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ఓ కంపెనీ ఉన్నట్టు గుర్తించారు. ఈ కంపెనీని 2024 జూలై 21న హైదరాబాద్ కేంద్రంగా రిజిస్టర్ చేశారని అంటున్నారు. ఈ కంపెనీకి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి, వేదపల్లి శివానందరెడ్డి డైరెక్టర్లుగా ఉన్నట్టు తెలిపారు. దీని షేర్ క్యాపిటల్ రూ.10 లక్షలుగా వెల్లడించారు. కంపెనీల పేర్లు దగ్గరగా ఉండటం కాకతాళీయమా లేక? ఏదైనా మతలబు ఉన్నదా అన్న అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు సీఎం సమక్షంలో కంపెనీ చైర్మన్‌గా పేర్కొన్న 'ప్రవీణ్ పరిపాటి' అమెరికాకు చెందిన శాస్త్రవేత్త అని, ఆయన 'సుజెయింట్' అనే బయోటెక్నాలజీ కంపెనీకి చెందినవారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ్ బయో కంపెనీ, స్వచ్ఛ్ బయోగ్రీన్ కంపెనీ ఒక్కటేనా? దానికి చైర్మన్ ప్రవీణ్ పరిపాటియేనా? అని అనుమానిస్తున్నారు. కేవలం 15 రోజుల కిందట ప్రారంభమైన కంపెనీ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి ఎలా పెట్టగలదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం వివరణ ఇవ్వాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

అమెరికాలో సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణలో అపార అవకాశాలు

న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని ప్రకటించారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు.

మీ జీవితం స్ఫూర్తిదాయకం

న్యూయార్క్‌లోని భారత అంధుల క్రికెట్ జట్టు (బాలుర)ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. అమెరికా పర్యటనలో ఉన్న జట్టు సభ్యులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ జట్టును కలుసుకునే అవకాశం రావటం ఎంతో అమూల్యంగా భావిస్తున్నానని.. ఈ టీమ్ ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఎన్ని అడ్డంకులున్నా ఎదిరించి నిలబడాలనే మానసిక స్థైర్యాన్ని వాళ్ల నుంచి నేర్చుకోవాలని సూచించారు. హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

- మూడేండ్లలో వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు
- అమెరికాలో సీఎం బృందంతో కంపెనీల భేటీ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్ నెలకొల్పేందుకు ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ కంపెనీ ప్రతినిధులు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు బృందంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే సెంటర్‌పై చర్చలు జరిపారు. మరో ఆరు నెలల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్టు ఆ కంపెనీ ప్రకటించింది. రాబోయే మూడేండ్లలో వెయ్యికిపైగా ఉద్యోగాలను కల్పించనున్నట్టు తెలిపింది. డాటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ ఈ సంస్థ అందిస్తున్నది. సుమారు రూ.1350 కోట్ల ఆదాయం కలిగిన ఈ కంపెనీలో 2500 మంది ఉద్యోగులుండగా వారిలో వెయ్యి మంది భారత్‌లో, సుమారు వంద మంది హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు.

ఆర్సీసీఎం విస్తరణ...

టెక్నాలజీ, సర్వీస్ సొల్యూషన్స్‌లో పేరొందిన ఆర్సీసీఎం కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో ఆ కంపెనీ సీఈవో గౌరవ్ సూరి భేటీ అయ్యారు. ఆర్సీసీఎం మొదటిసారిగా హైదరాబాద్‌లో తమ ఆఫీసును విస్తరించనుంది. ఆ సంస్థ అమెరికా వెలుపల కంపెనీ పెట్టడం ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా తమ సేవల విస్తరణకు హైదరాబాద్ సెంటర్ కీలకంగా నిలుస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వచ్చే రెండేండ్లలో హైదరాబాద్‌లో 500 మంది సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది.

బోగస్ కంపెనీలతో రేవంత్ ఒప్పందాలు

- 4 నెలల క్రితం ఏర్పాటైన సంస్థతో ఎంవోయూ
- స్ట్రైక్‌ఆఫ్ అయిన కంపెనీ పెట్టుబడి పెట్టగలదా?
- ప్రజల సొమ్ముతో బృందాలుగా విదేశీ టూర్లు
- బీఆర్‌ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బోగస్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణలో రూ.839 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు వాల్స్ కర్రా హోల్డింగ్స్ కంపెనీ ముందుకొస్తే ఒప్పందం కుదుర్చుకున్నామని సీఎం కార్యాలయం ప్రకటించడంపై మండిపడ్డారు. ఆ సంస్థ నాలుగు నెలల క్రితమే ఏర్పాటైందని, ఇద్దరే డైరెక్టర్లు ఉన్నారని, ఎలాంటి వార్షిక నివేదికలు లేవని వెల్లడించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీశాఖ మాజీ మంత్రి కేటీఆర్ కంటే తాను మెరుగ్గా పనిచేశానని చెప్పడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి బోగస్ కంపెనీలతో ఒప్పందం చేసుకుంటున్నారని మండిపడ్డారు. సీఎం ఎవరితో, ఏ కంపెనీతో ఒప్పందం చేసుకున్నా వారి ట్రాక్ రికార్డ్ మంచిదై ఉండాలని హితవు పలికారు. తెలంగాణభవన్‌లో మంగళవారం క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ.. స్ట్రైక్ ఆఫ్ అయిన వాల్స్ కర్రా హోల్డింగ్ కంపెనీ తెలంగాణలో ఎట్లా పెట్టుబడులు పెడుతుంది? అని నిలదీశారు. రాని కంపెనీల కోసం రేవంత్‌రెడ్డి అమెరికాకు వెళ్లారా? అని ప్రశ్నించారు. దావోస్ వెళ్లి గోదీ ఇండియా అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని, రూ.27 లక్షల వార్షిక ఆదాయం ఉన్న ఈ సంస్థ ఎలా పెట్టుబడిపెడుతుందని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు అప్పగించే సంస్థపై లుక్ అవుట్ నోటీసు ఉన్నదని చెప్పారు. సీఎం బృందం అమెరికా పర్యటనలో, సీఎం తమ్ముడి బృందం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని తెలిపారు. ప్రజల ధనంతో విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు తెలంగాణకు పెట్టుబడుల కోసం ఒరిజినల్, మంచి ట్రాక్‌రికార్డ్ ఉన్న కంపెనీలను తీసుకురావాలని హితవుపలికారు. ముఖ్యమంత్రి పర్యటనలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా నాటకాలు బంద్ చేసి సరైన కంపెనీల నుంచి పెట్టుబడులు తీసుకురావాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ ఖ్యాతి గడించిందని క్రిశాంక్ గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఐటీ ఎగుమతులు పెరిగాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం వృద్ధి చెందాయని చెప్పారు. హైదరాబాద్ ఐటీకి గమ్యస్థానంగా మారినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ ఆడబిడ్డలకు ఇస్తామన్న రూ.2,500 ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు.

మహదేవపూర్‌లో కేటీఆర్‌పై కేసు

- బీఆర్‌ఎస్ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై కూడా..
- మేడిగడ్డ బరాజ్‌పై డ్రోన్ ఎగరేశారంటూ ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు

మహదేవపూర్, ఆగస్టు 6 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణరెడ్డిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జూలై 26న కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సోషల్ మీడియా కార్యకర్తలు కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌పై అనుమతి లేకుండా డ్రోన్ కెమెరా ఎగరేసి చిత్రీకరించారని ఇరిగేషన్ శాఖ అధికారులు అభియోగంమోపారు. వారి ఫిర్యాదు మేరకు మహదేవపూర్ పోలీసులు జూలై 29న కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణరెడ్డిపై సెక్షన్ 223(బీ) కింద కేసు నమోదు చేశారు. వీరితోపాటు నాయకులు, కార్యకర్తలనూ జోడించారు.

14 జిల్లాలకు ఇన్‌చార్జి డీఐఈవోలు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 14 జిల్లాలకు ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్(డీఐఈవో)ను నియమిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పలువురు ప్రిన్సిపాళ్లు బదిలీ కాగా, ఇన్‌చార్జి డీఐఈవోలుగా వ్యవహరిస్తున్న వారికి స్థానచలనం కలిగింది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి డీఐఈవోలను నియమించారు. కొత్తగా నియమితులైన డీఐఈవోలు ఆయా జిల్లాల్లో వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఖైదీల వివరాలివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 6, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జైళ్లలో ఉన్న ఖైదీలు, విచారణ ఖైదీల వివరాలను నివేదించాలని జైళ్ల శాఖను హైకోర్టు పీపీ కార్యాలయం కోరింది. ఖైదీల ఆరోగ్య స్థితిగతులు, బెయిల్ పిటిషన్ల పరిస్థితి, వివరాలన్నింటినీ ఇవ్వాలంటూ లేఖ రాసింది. ఇటీవల ఓ కేసులో నిర్దోషిగా తీర్పు వచ్చిన నిందితుడు పోచయ్య అప్పటికే జైలులో మరణించాడు. ఈ విషయం కోర్టు దృష్టికి రాలేదు. ఫలితంగా కోర్టులపై జనానికి తేలిక భావన ఏర్పడే అవకాశం ఉంటుందని ఖైదీల వివరాలను పీపీ కార్యాలయం కోరింది.

కేంద్రం కులగణన చేపట్టాలి

కేంద్ర ప్రభుత్వం జన గణనలో భాగంగా కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. –హైదరాబాద్

బాలికపై కౌన్సిలర్ అఘాయిత్యం!

- మాట కలిపి.. కారులో తీసుకెళ్లి దారుణం
- నిందితుడికి స్థానికుల దేహశుద్ధి
- కౌన్సిలర్‌పై కేసు.. రిమాండ్

కౌన్సిలర్ రాధాకృష్ణ

శక్కర్‌నగర్, ఆగస్టు 6: బాలికతో మాట కలిపిన ఓ కౌన్సిలర్ నమ్మించి వంచించాడు. ఇంటికి తీసుకెళ్తానని చెప్పి కారులో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత దర్జాగా వైన్స్ వద్ద మద్యం సేవిస్తుండగా, ఏడుస్తున్న బాలికను గమనించిన స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బోధన్‌లోని మూడో వార్డు (శక్కర్‌నగర్) కౌన్సిలర్ కొత్తపల్లి రాధాకృష్ణ నిజామాబాద్ వెళ్లాడు. అక్కడ ఆటోలో వెళ్తున్న తన ప్రాంతానికి చెందిన, పరిచయమున్న పదహారేండ్ల బాలిక కనిపించింది. ఆటో వద్దకు వెళ్లి ఆమెతో మాట కలిపాడు. తాను బోధన్‌కే వెళ్తున్నానని చెప్పి తన కారులో ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో ఎడపల్లి వద్ద దారి మళ్లించి మంగళ్‌పాడ్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం ఎడపల్లికి వచ్చి వైన్స్‌లో మద్యం తీసుకుని తాగుతుండగా, కారులో ఉన్న బాలిక కేకలు వేసింది. గమనించిన స్థానికులు అనుమానం వచ్చి కౌన్సిలర్‌ను పట్టుకుని ప్రశ్నించగా, పొంతన లేని సమాధానం చెప్పాడు. బాలికను ప్రశ్నించగా జరిగింది చెప్పడంతో అతడిని చితకబాది ఎడపల్లి పోలీసులకు అప్పగించారు. సదరు కౌన్సిలర్‌ను బోధన్ సీఐ కార్యాలయానికి తరలించగా, బాధితురాలి తరఫు వారు పెద్దసంఖ్యలో వచ్చి ఆందోళనకు దిగారు. నిందితుడిని తప్పించే ప్రయత్నంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కౌన్సిలర్‌పై కిడ్నాప్‌తోపాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని, చట్టపరంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అఘాయిత్యానికి పాల్పడిన ప్రాంతాన్ని ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ నరేశ్, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా కౌన్సిలర్ రాధాకృష్ణ సోదరుడు రవీందర్ సైతం గతంలో ఇలాగే ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఏడాదిన్నర క్రితం మూడో వార్డుకు చెందిన ఓ మైనర్‌పై దారుణానికి ఒడిగట్టిన కేసులో రవీందర్‌తోపాటు రాధాకృష్ణ కూడా జైలుకు వెళ్లొచ్చారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో పెరిగిన వలస పులులు

- జిల్లా కేంద్రానికి 5 కి.మీ దూరంలో సంచరిస్తున్న పెద్దపులి
- పంట పొలాల్లో పులి సంచారంతో భయాందోళనలో రైతులు

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): అడవుల జిల్లా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు మహారాష్ట్రలో పులుల సంఖ్య గణనీయంగా పెరగడం, ఆవాసం కోసం జిల్లాలోని అడవుల్లోకి వస్తుండటంతో కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల సంచారం పెరిగింది. జిల్లా కేంద్రానికి 5 కిమీ దూరంలోని గోవింద్‌పూర్, గుండి, కేస్లాపూర్‌లోని పంట చేన్లలో పెద్దపులి సంచరించడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. సమీప పొలాల్లో పులి పాదముద్రలు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌ఆర్వో గోవింద్‌చంద్, డీఆర్వో యోగేశ్, ఎఫ్‌ఎస్‌వో విజయ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పెద్దపులి పాదముద్రలుగా నిర్ధారించారు. గోవింద్‌పూర్ మీదుగా జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వెనుక నుంచి పెద్దవాగు దాటి కాగజ్‌నగర్ మండలం అంకుషాపూర్ వైపు వెళ్లి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రతినెలా క్రైమ్ రివ్యూలు నిర్వహించాలి

- రౌడీలు, అసాంఘిక శక్తులపై దృష్టిపెట్టాలి
- డయల్ 100 రెస్పాన్స్ టైమ్‌ను మెరుగుపర్చాలి
- అర్ధవార్షిక నేర సమీక్షలో డీజీపీ జితేందర్ స్పష్టీకరణ
- గత 6 నెలల్లో పోలీసుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం

సమీక్షలో వివరాలు వెల్లడిస్తున్న డీజీపీ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేరాలను కట్టడి చేసేందుకు ఇకనుంచి ప్రతినెలా ప్రత్యక్షంగా, వర్చువల్‌గా క్రైమ్ రివ్యూలు నిర్వహించాలని డీజీపీ జితేందర్ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. నేరాల తీరును విశ్లేషించడం, కొత్త చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం డీజీపీ ఆఫీసులో అర్ధవార్షిక సమీక్ష నిర్వహించారు. గత 6 నెలల్లో జరిగిన దారుణాలను డీజీపీ ఈ సమావేశంలో ప్రస్తావిస్తూ.. పలు జిల్లాల ఎస్పీలు, కమిషనర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న రౌడీలు, ఇతర అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంలో పోలీసులు విఫలమతున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. ఈ ధోరణిని వెంటనే మార్చుకోవాలని హితవు పలికారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలతోపాటు సైబర్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నేరాలను సమర్థంగా నిరోధించకపోతే ఎవరినీ ఉపేక్షించేది లేదని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుప్రమాదాల నివారణపై దృష్టిపెట్టాలని, అన్ని వర్గాల ప్రజలతో రోడ్డు భద్రతా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

టైమ్‌కు ఎందుకు చేరుకోలేకపోతున్నారు?

రాష్ట్రంలో డయల్ 100 ప్రతిస్పందన సమయం దారుణంగా పడిపోయిందని డీజీపీ జితేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. సకాలంలో బాధితుల వద్దకు ఎందుకు చేరుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. డయల్ 100 రెస్పాన్స్ టైమ్‌ను మెరుగుపర్చేందుకు పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 6 నెలల నుంచి కొందరు పోలీసుల పని తీరు సరిగా లేకపోవడం వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వచ్చిందని మండిపడ్డారు. ఇకనుంచైనా శాంతిభద్రతల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో నక్సల్స్‌పై విస్తృతంగా దాడులు జరుగుతున్నందున వారు తెలంగాణలోకి రాకుండా అడ్డుకునేందుకు ఇంటెలిజెన్స్ అధికారులు, కూంబింగ్ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

విభాగాల వారీగా నివేదికలు

సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల దొంగతనాలు, మానవ అక్రమ రవాణా, వాహనాల చోరీ, తదితర అంశాలపై సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించేందుకు చేపడుతున్న చర్యలపై టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య డీజీపీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇతర అంశాలపై ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ బీ శివధర్‌రెడ్డి, అడిషనల్ డీజీలు అభిలాష బిస్త్ (ట్రైనింగ్), వీవీ శ్రీనివాసరావు (టెక్నికల్ సర్వీసెస్), విజయ్ కుమార్ (పర్సనల్, వెల్ఫేర్), సంజయ్ కుమార్ జైన్ (బెటాలియన్స్) నివేదికలు సమర్పించారు. 27 హత్యలు, 6 అత్యాచారాలకు సంబంధించిన కేసుల్లో దోషులకు జీవిత ఖైదు పడేలా చర్యలు చేపట్టిన 36 మంది అధికారులు, 30 మంది ప్రాసిక్యూటర్లకు ఈ సమావేశంలో డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

'స్థానిక 'బీసీ రిజర్వేషన్లకు చేపట్టిన చర్యలేమిటి?

ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అధ్యయనం నిర్వహించే అంశంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీం కోర్టు తీర్పులకు అనుగుణంగా బీసీల స్థితిగతులపై అధ్యయనం జరిపేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటో చెప్పాలని కోరింది. స్థానిక సంస్థ ల్లో రిజర్వేషన్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 5ను సవాలు చేస్తూ జాజుల శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్‌కుమార్ తదితరులు దాఖలు చేసి న వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవా రం విచారణ జరిపింది. 2010లో కృష్ణమూర్తి కేసు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాలను కాకుండా రాజకీయ వెనుకబాటుతనాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, దీనిపై అధ్యయనం జరగాల్సి ఉన్నదని ఏజీ ఏ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దీంతో ఆ అధ్యయనానికి చేపట్టిన చర్యలేమిటో నివేదించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను 12కి వాయిదా వేసింది.

ప్రింటెడ్ ఇక్కత్ చీరల తయారీపై నేతన్నల నిరసన

జనగామ జిల్లా కేంద్రంలో నేతన్నలు 'చేనేత పరిరక్షణ ర్యాలీ' నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చేనేత ఇక్కత్ ప్రింటెడ్ చీరలకు నిరసనగా చేనేత చీరను దహనం చేశారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రాచీన చేనేత కల కనుమరుగయ్యేలా సూరత్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో బడా కంపెనీలు పోచంపల్లి ఇక్కత్ గుర్తింపు పొందిన చీరలను ప్రింట్ చేస్తూ చేనేత కార్మికుల వృత్తిని కొల్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. – జనగామ, నమస్తేతెలంగాణ

పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల బైఠాయింపు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం జీవనభృతి పింఛన్లు పెంచాలని, ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో ఇందల్వాయిలో కార్మికులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. – ఇందల్వాయి

మొక్కల పెంపకంపై నివేదిక ఇవ్వండి

రాష్ర్టానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా చెట్ల పెంపకంపై గణాంకాలతో సమగ్ర వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 12న తదుపరి విచారణ జరిగే నాటికి నివేదిక సమర్పించాలని తెలిపింది. నగరాలు, పట్టణాల్లో ప్రజల జీవితాలు ఉరుకులు పరుగులుగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు సేద తీరాలన్నా, ఊరట పొందాలన్నా పార్కులు ఎంతో అవసరమని, పార్కుల అభివృద్ధితోపాటు మొక్కలు నాటేవిధంగా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌కు చెం దిన కే ప్రతాప్‌రెడ్డి పిల్ దాఖలుచేశారు. దీ నిపై ప్రధాన న్యాయమూర్తి జస్టి స్ అలో క్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచార ణ జరిపింది. అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 'గ్రీనరీ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలు 8 శాతం గా ఉండగా, రాష్ట్రంలో 8.2 శాతంగా ఉందని చెప్పారు. శ్మశానా ల్లో కూడా మొక్కలు పెంచుతున్నామని తెలిపారు. 2022– 23లో 77,87,561 మొక్కలు, 2023– 24లో 72,28,127 మొక్కులు నాటినట్టు వివరించారు.